నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 | మహబూబ్‌నగర్, మంగళవారం 1 అక్టోబర్ 2024 | MAHABUBNAGAR NARAYANPET

అడ్రస్‌లేని కాంగ్రెస్ హామీలు

- పెబ్బేరు ధర్నాలో బీఆర్ఎస్ నేతలు

పెబ్బేరు, సెప్టెంబర్ 30 : వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేసి తీరు తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీ ఏమైందని పెబ్బేరు మండల బీఆర్ఎస్ నేతలు ప్రశ్నించారు. సోమవారం సుభాశ్ చౌరస్తాలో రైతులతో కలిసి వారు పెద్దఎత్తున రాస్తారోకో, తాసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేసి అధికారికి వినతిపత్రం అంద జేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వనం రాములు, మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ, వైస్‌చైర్మన్ కరిస్వామి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి అభివృద్ధి పనులను పక్కనబెట్టి, ఆరు హామీలను తుంగలో తొక్కి హైడ్రా పేరుతో పేదల ఇండ్లు కూల్చుతూ రాష్ట్రంలో భయానక వాతావరణం సృష్టిస్తున్నాడని ఆరోపించారు. వంద రోజుల్లో హామీలన్నీ అమలు చేస్తామని చెప్పి, మూడు వందల రోజులు దాటినా వాటి ఊసే ఎత్తడం లేదన్నారు. రైతులకు రుణమాఫీ, రైతు భరోసా, పింఛన్ల పెంపు, మహిళలకు గృహలక్ష్మి పథకం, కల్యాణ లక్ష్మి పథకంలో తులం బంగారం ఇస్తామని చెప్పి వాటి జోలికే పోవడం లేదని వారు విమర్శించారు.

ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని బీఆర్ఎస్ శ్రేణులు డిమాండ్ చేశారు. అనంతరం తాసీల్దార్ కార్యాలయంలో డీటీ లక్ష్మీకాంతకు వినతిపత్రం అంద జేశారు. కార్యక్రమంలో నాయకులు పెద్దింటి వెంకటేశ్, మధు, ఎల్లారెడ్డి, వెంకటన్నగౌడ్, వీరస్వామి, వేణు, గోవిందు, రమేశ్ పాల్గొన్నారు.

పెబ్బేరు తాసీల్దార్ కార్యాలయంలో డీటీకి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

పర్యాటకులకు పరవశమే..

- నేటి నుంచి జంగల్ సఫారీ
- ముగిసిన మూణ్నెళ్ల నిషేధం
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఫారెస్ట్ అధికారులు
- సందర్శనకు సిద్ధమైన 11 వాహనాలు
- నల్లమల అందాలు ఆస్వాదించేలా టూర్
- ఆన్ లైన్ బుకింగ్‌లో ప్రత్యేక ప్యాకేజీలు

అచ్చం పేరు, సెప్టెంబర్ 30 : నాగర్‌కర్నూల్ జిల్లాలోని ఏటీఆర్ (అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్) జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది. దాదాపు 2,611 చదరపు కిలో మీటర్ల మేర అడవి విస్తరించి ఉన్నది. 1,983 నుంచి ఉమ్మడి రాష్ట్రంలో రాజీవ్ టైగర్ అభయారణ్యంగా ఉన్న ఈ అడవి తెలంగాణ ఏర్పాటుతో అమ్రాబాద్ అభయారణ్యంగా మారింది. దట్టమైన నల్లమలలో ఎన్నో ప్రకృతి అందాలతోపాటు వన్యప్రాణులు, జంతువులు, పక్షులకు నెలవు. అలాగే అడవి ఒడిలో శ్రీశైలం, మల్లెలతీర్థం, భీరాపూర్, అక్కమ హాడ్ గుహ, ఉమామహేశ్వరం, మద్దిమడుగు వంటి ఆధ్యాత్మిక క్షేత్రాలు.. సోమశిల నుంచి శ్రీశైలం ప్రాజెక్టు వరకు కొండల మధ్య హోయలు పోతున్న కృష్ణానది అందాలు వర్ణణాతీతం. ఈ అడవి పెద్దపులులకు ప్రత్యేకంగా నిలుస్తోంది. పెద్దపులుల రక్షణకు ఏపీతో కలిపి జాయింట్ రివర్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమేణా పెద్ద పులుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. ప్రస్తుతం 34 పులులు ఉన్నట్లు ఫారెస్ట్ అధికారులు తెలిపారు. ఈ అటవీ ప్రాంతం పెద్దపులులకు సేఫ్ జోన్‌గా మారింది.

సఫారీకి సందర్శకుల తాకిడి

మూడేండ్ల కిందట సఫారీ యాత్రను ఫారెస్ట్ అధికారులు ప్రారంభించగా.. విజయవంతంగా కొనసాగుతూ వస్తోంది. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరిగింది. దీన్ని దృష్టిలో ఉంచుకొని గతంలో ఉన్న 8 వాహనాలకు అదనంగా మరో మూడు సఫారీ వాహనాలను సమకూర్చారు. అలాగే పర్యాటకుల కోసం కాటేజీలను ఏర్పాటు చేశారు. దూర ప్రాంత పర్యాటకులు రాత్రి సమయంలో వీటిల్లో బస చేసి ప్రత్యేక అనుభూతిని పొందవచ్చు. ఈ సఫారీ టూర్ కోసం ఆన్‌లైన్‌లో టిక్కెట్లు బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. కాగా అటవీ ప్రాంతం వివరాలను ప్రజలకు అందరికీ తెలిసేలా ఏటీఆర్ పేరిట ప్రత్యేక వెబ్‌సైట్‌ను కూడా ఏర్పాటు చేశారు.

నేటి నుంచి టూర్

నల్లమల అటవీ అందాలు.. పచ్చని ప్రకృతి సోయగాల మధ్య సాగే జంగల్ సఫారీని ఆస్వాదించాలనుకునే వారికి గుడ్‌న్యూస్.. సఫారీ టూర్ మంగళవారం నుంచి పునఃప్రారంభంకానున్నది. ప్రతిఏటా జూలై ఒకటో తేదీ నుంచి సెప్టెంబర్ 30 వరకు మూడు నెలలపాటు బ్రేక్ పడనున్న ది. ఈ మూడు నెలలు వన్యప్రాణుల సంతానోత్పత్తికి అను కూల సమయంగా భావించి అటవీ శాఖ సేవలను నిలిపివేస్తున్నది. ఈ కాలంలో అటవీలోకి పర్యాటకులు, ఇతరులు వెళ్లకుండా నిషేధం విధిస్తారు. ప్రస్తుతం మూడు నెలల బ్రేక్ పూర్తవగా.. అక్టోబర్ ఒకటో తేదీ నుంచి తిరిగి సఫారీ టూర్ ప్రారంభకానున్నది. ఈ నేపథ్యంలో సందర్శకుల కోసం వాహనాలను సిద్ధం చేశారు. ఈ టూర్ పర్యాటకులను మధురానుభూతిని మిగిల్చినున్నది.

పెరగనున్న అవగాహన, విజ్ఞానం

నల్లమలలో సఫారీ ప్రయాణం పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటున్నది. శ్రీశైలం వెళ్లేవారు ఎవరైనా ఈ సఫారీని ఎంజాయ్ చేయకుండా వెళ్లరు. సందర్శకులకు కొత్త అనుభూతిని అందిస్తోంది. అడవీ ప్రాంతంలో వృక్షాలు, వన్యప్రాణులు, దట్టమైన అడవీ ప్రాంతం ఆకట్టుకుంటుంది. జంతువుల జాడ తెలుసుకునేందుకు అటవీశాఖ ఏర్పాటు చేసిన కెమెరాలు, జంతువుల కోసం తాగునీటి ఏర్పాట్లు ఈ సఫారీ టూర్‌లో పర్యాటకులు చూసే అవకాశం ఉంటుంది. పర్యాటకంగా అవగాహనతోపాటు విజ్ఞానం పెరగనున్నది. కొన్నిసార్లు వెళ్లే మార్గంలో అడవి జంతువులు దుప్పి, జింకలు, నెమళ్లు, అడవిపంది, రేసుకుక్కలు, ఇతర వన్యప్రాణులు కనిపిస్తాయి. రైడ్ మధ్యలో ఒక్కోసారి పులుల పాద ముద్రలు, చెట్లపై వేసిన పంజాగుర్తులు, అడుగు జాడలు కనిపిస్తాయి. మరి ముఖ్యంగా నల్లమల అటవీ ప్రాంతం అనేక రకాల వృక్షాలు, జంతు జాలాలకు నిలయం కావడంతో ఈ ప్రయాణం జీవితంలో మర్చిపోలేని అనుభూతిని మిగిల్చడం ఖాయం.

ప్యాకేజీల వివరాలు..

- ప్యాకేజీ–1 రూ.5,500
- ప్యాకేజీ–2 రూ.6,500
- ప్యాకేజీ–3 రూ.7,000
- ప్యాకేజీ–4 రూ.8,000

వాహనాలు సిద్ధం

శ్రీశైలం వెళ్లే మార్గంలోని నల్లమల అటవీ ప్రాంతం ఇప్పుడు సందర్శకులను ఆత్మీయంగా ఆహ్వానిస్తోంది. శ్రీశైలం వెళ్లేదారిలో ఫరహాబాద్ చౌరస్తా వద్ద సఫారీ వాహనాలు సిద్ధంగా ఉండనున్నాయి. ఆన్ లైన్‌లో.. ఆఫ్‌లైన్‌లో వాహనాలు బుకింగ్ చేసుకోవచ్చు. ప్రతి రోజు ఉదయం 9 గంటల సాయంత్రం 5 గంటల వరకు సఫారీ సేవలు అందుబాటులో ఉంటాయి. ఆన్ లైన్‌లో బుక్ చేసుకున్న వారికి ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ నాలుగు ప్యాకేజీలను అందుబాటులో ఉంచింది. రూ.5,500, రూ.6,500, రూ.7,000, రూ.8,000 వరకు ధర నిర్ణయించింది. ఒక సఫారీ వాహనంలో ఏడుగురు మాత్రమే ప్రయాణం చేయాల్సి ఉంటుంది. ఒకటి, రెండ్రోజుల పాటు బుకింగ్ మేరకు సేవలు అందిస్తారు. పర్యాటకులు రాత్రి బస చేసేందుకు వనమాలికలో ఏసీ, నాన్‌ఏసీ గదులు అందుబాటులో ఉంచనున్నారు. బుకింగ్ తర్వాత మొదటిరోజు మధ్యాహ్నం 12 గంటల వరకు మన్ననూర్ వనమాలికకు సందర్శకులు చేరుకుంటే అక్కడ కాటేజీలను కేటాయిస్తారు. మరుసటిరోజు ఉదయం బయో టాయ్‌లాబ్, ప్లాస్టిక్ రీసైక్లింగ్ చేసే విధానం, వన్యప్రాణుల విడిభాగాల ప్రదర్శన, పర్యాటక కేంద్రం చూపిస్తారు. అక్కడి నుంచి సఫారీ వాహనంలో అడవి మార్గం మీదుగా ఫరహాబాద్ చౌరస్తా నుంచి దట్ట మైన అడవిలోకి వాహనంలో తీసుకెళ్తారు. వన్యప్రాణులు తిరిగే ప్రాంతంలో సఫారీ వాహనం నుంచి అడవి అందాలను వీక్షిస్తూ ముందుకు యాత్ర కొనసాగిస్తున్నారు. ఇక్కడ ప్రతి విషయాన్ని వాహనంలో ఉండే గైడ్.. సందర్శకులకు వివరిస్తారు.

అధికార్ల దోపిడీ!

- ట్యాక్సీ ప్లేట్ కాకుండా వైట్ బోర్డు వెహికిల్స్‌తో..
- బినామీ పేర్లపై నెలనెలా అద్దె కాజేస్తున్న ఆఫీసర్లు
- ఒక్కో వాహనానికి నెలకు రూ.33 వేలు చెల్లింపు
- నిరు ద్యోగులకు దక్కని ఉపాధి
- ప్రభుత్వ ఖజానాకు గండి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, సెప్టెంబర్ 30 : రూ.లక్షల్లో జీతాలు.. బాధ్య తాయుతమైన ఉద్యోగం.. గౌరవప్రదమైన హోదా.. ఇవన్నీ ఉన్నప్పటికీ కొందరు అధికారులు కాసులకు కక్కుర్తి పడుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అద్దె కార్ల దందా యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. దీంతో నిరుద్యోగులకు ఉపాధి లేకుండా చేస్తున్నారు. ట్యాక్సీ వాహనం పేరిట ప్రతి నెలా బిల్లులు కాజేస్తూ ఖజానాకు గండి కొడుతున్నారు. ప్రభుత్వ అధికారులు పర్యటించేందుకు సొంత వాహనాలు కొనుగోలు చేసే పరిస్థితి లేకపోవడంతో.. అవసరమైన వాటిని అద్దెకు తీసు కునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది. అందుకోసం ఒక్కో వాహనానికి నెలనెలా రూ.33 వేలు అద్దె చెల్లించేందుకు ఆదేశాలున్నాయి.

మహబూబ్‌నగర్ కలెక్టరేట్ ఏవోకు ఫిర్యాదు చేస్తున్న ఫోర్ వీలర్స్ డ్రైవర్స్ హైర్ వెహికిల్స్ అసోసియేషన్ నాయకులు (ఫైల్)

నిరుద్యోగులకు దక్కని ఉపాధి

బ్యాంకు రుణాలు, రాయితీ, కార్పొరేషన్లతోపాటు ఓనర్ కం డ్రైవర్ వంటి పథకాలను ప్రవేశపెట్టి నిరుద్యోగులకు ఉపాధి కల్పించినట్లు అవుతుందని ప్రభుత్వం భావించింది. ఈ మేరకు వారిని ప్రోత్సహించింది. అయితే క్షేత్ర స్థాయిలో పరిస్థితి అందుకు పూర్తి భిన్నంగా ఉన్నది. జిల్లా వ్యాప్తంగా కొందరు అధికారులు సొంత వాహనాలు, తమ బంధువులకు సంబంధించిన వాటిని బినామీ పేర్లతో అద్దె ప్రాతిపదికన నడిపిస్తున్నారు. వీటికి కనీసం ట్యాక్సీప్లేట్ ఉండాలన్న విషయాన్ని కూడా వారు పట్టించుకోవడం లేదు. బినామీ పేర్లతో నెలనెలా బిల్లులు తీసుకుంటూ నిరుద్యోగుల ఉపాధిపై నీళ్లు చల్లుతున్నారు. జిల్లాలోని మండలాల తాసీల్దార్లతోపాటు ఎంపీడీవోలు, జిల్లాలో వివిధ శాఖల అధికారులు సైతం అద్దె కార్ల దందాను కొనసాగిస్తుండడం గమనార్హం.

తెలుపు రంగు నెంబర్ ప్లేటుతో..

అధికారులకు సంబంధించిన వాహనాలపై 'ఆన్ గౌట్ డ్యూటీ' పేరిట తెల్ల నెంబర్ ప్లేట్లు ఉంటున్నాయి. ఇలాంటి వాహనాలు ప్రభుత్వ పనుల కోసం రోడ్లపై తిరుగుతున్నా.. రవాణాశాఖ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. వ్యక్తిగత వాహనాలకు బిల్లులు పెట్టుకోవడం సాధ్యం కాకపోవడంతో సదరు అధికారులు ట్యాక్సీప్లేట్ కలిగిన వాహనాదారులతో కమిషన్ మాట్లాడు కొని అద్దె కార్ల దందాను నడిపిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులు వినియోగిస్తున్న వాహనాలు

కొందరు జిల్లా స్థాయి అధికారులు సైతం..

కోఆపరేటివ్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, ముఖ్య ప్రణాళిక, మిషన్ భగీరథ, పంచాయతీరాజ్, మున్సిపాలిటీ, హౌసింగ్, ఆర్‌అండ్‌బీ, డీఆర్‌డీఏ, ఇరిగేషన్ వంటి ప్రధాన శాఖల్లోనూ బినామీ పేర్లతో అద్దె వాహనాలు కొనసాగిస్తున్నారు. సంబంధిత అధికారులు చేతివాటం ప్రదర్శిస్తున్నారని, ఈ విషయంపై కలెక్టర్, ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఫోర్ వీలర్స్ డ్రైవర్స్ హైర్ వెహికిల్స్ అసోసియేషన్ నాయకులు కలెక్టరేట్ ఏవో శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఇందుకు స్పందిస్తూ త్వరలో సమగ్ర నివేదికలు సేకరించి చర్యలు సేకరిస్తామని పేర్కొన్నారు.

రుణమాఫీ లేక అప్పులపాలయ్యాం

- పెంట్లవెల్లి సొసైటీ ఎదుట రాస్తారోకోలో రైతులు

పెంట్లవెల్లిలో కొల్లాపూర్–పెబ్బేరు ప్రధాన రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేపట్టిన రైతులు

పెంట్లవెల్లి, సెప్టెంబర్ 30 : ప్రభుత్వం చేసిన వ్యవసాయ రుణమాఫీ వర్తించకపోవడంతో అప్పుల ఊబిలో కూరుకుపోయి కష్టాలపాలయ్యామని పలు వుళ్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం పెంట్లవెల్లి సొసైటీ పరిధిలోని కొండూరు, మల్లేశ్వరం, మంచాలకట్ట, మాధవస్వామిగర్, ఎంగంపల్లి తండా, రామాపురం గ్రామాలకు చెందిన రుణమాఫీ కాని రైతులు నిరసనకు దిగారు. అంతకు ముందు సొసైటీ కార్యాలయంలో విండో చైర్మన్ విజయరామారావు అధ్యక్షన మహాజన సభ కార్యక్రమాన్ని నిర్వహిస్తుండగా.. రైతులు అక్కడకు వెళ్లి అడ్డుకున్నారు. కార్యాలయం ఎదుట కొల్లాపూర్–పెబ్బేరు ప్రధాన రోడ్డుపై బైఠాయించి గంటన్నరసేపు రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా పలు వుళ్లు రైతులు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ మేని ఫెస్టోలో ప్రకటించిన విధంగా అర్హులైన రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రకటించిన మూడు విడుతల్లో పెంట్లవెల్లి సొసైటీలో రుణాలు తీసుకున్న 499 మంది రైతుల్లో ఒక్కరికి కూడా నయా పైసా మాఫీ వర్తించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వీరిలో మీకు ఓట్లేసి నోళ్లుకని పిచడం లేదా.. అంటూ మంత్రిని ప్రశ్నించారు. రుణమాఫీ అవుతుందన్న నమ్మకంతో అవసరాల కోసం ఇతరుల వద్ద మళ్లీ డబ్బులు అప్పు తెచ్చామని, ఇప్పుడు మా పరిస్థితి ఏమిటని ప్రభుత్వాన్ని నిల దీశారు.

డీఎస్సీ ఫలితాలు విడుదల

- ఆన్‌లైన్‌లో 1:3 నిష్పత్తిలో అభ్యర్థుల జాబితా
- నేటి నుంచి జిల్లాల వారీగా ధ్రువపత్రాల పరిశీలన

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, సెప్టెంబర్ 30 : ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ఈ ఏడాది జూలై 18 నుంచి ఆగస్టు 5వ తేదీ వరకు నిర్వహించిన పరీక్షల ఫలితాలను రాష్ట్ర ప్రభుత్వం సోమవారం విడుదల చేసింది. 1:3 నిష్పత్తిలో ఎంపికైన అభ్యర్థుల వివరాలను www.schooledu.telangana.gov.in లో అందుబాటులో ఉంచినట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు తెలిపారు. వెబ్‌సైట్‌లో పొందుపర్చిన జాబితాలో పేరున్న అభ్యర్థుల విద్యార్హత ధ్రువీకరణ పత్రాలను జిల్లాల వారీగా ఈనెల ఒకటో తేదీ నుంచి ప్రతి రోజూ ఉదయం 10నుంచి సాయంత్రం 5 గంటల వరకు వెరిఫికేషన్ చేయనున్నారు. అభ్యర్థులు అఫ్లికేషన్ ఫారంతోపాటు 2 సెట్ల అటెస్టేషన్ సర్టిఫికెట్లు, ఒరిజినల్ సర్టిఫికెట్లతో ధ్రువపత్రాల పరిశీనకు హాజరు కావాల్సి ఉంటుందని విద్యాశాఖ అధికారులు పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన అభ్యర్థులకు జిల్లా కేంద్రం మెట్టుగడ్డలోని డైట్ కళాశాలలో ధ్రువపత్రాల పరిశీనకు హాజరు కావాల్సి ఉంటుందని డీఈవో రవీందర్ సోమవారం ప్రకటనలో తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లాలో 243, నాగర్‌కర్నూల్‌లో 285, నారాయణపేటలో 279, వనపర్తిలో 152, జోగులాంబ గద్వాల జిల్లాలో 172 ఖాళీలు డీఎస్సీ ద్వారా నియామకాలు చేపట్టేందుకు అందుబాటులో ఉన్నాయి.

సర్టిఫికెట్ వెరిఫికేషన్ జరగనున్న మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాల

యోగా శిక్షకుల పోస్టులకు ఇంటర్వ్యూలు

- ఉమ్మడి జిల్లాలో 119 మంది అభ్యర్థుల ఎంపిక

మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 30 : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా ఆయుష్ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా శిక్షకుల పోస్టుల ఎంపిక కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినట్లు డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఆయుష్, అదనపు సంచాలకులు పరమేశ్ నాయక్, ప్రాంతీయ ఉప సంచాలకుడు రవినాయక్, జిల్లా హెల్త్ వెల్‌నెస్ సెంటర్ ఇన్‌చార్జి ఆదిశేషయ్య, సీనియర్ మెడికల్ ఆఫీసర్ చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ దవాఖానలోని ఆయుష్ డిపార్ట్‌మెంట్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 130 మంది హాజరుకాగా 119 మందిని ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికలో ఆయుష్ డిపార్ట్‌మెంట్ అధికారులు ఫయీమ్, రూత్, రాజేందర్, జిల్లా ప్రోగ్రాం మేనేజర్ సురేశ్ నాయక్, సురేశ్, జోషీ తదితరులు పాల్గొన్నారు.

జూరాల డ్యాం @ ఐదు గేట్లు

గద్వాల, సెప్టెంబర్ 30 : ఎగువన కురుస్తున్న వర్షాలతో సోమవారం జూరాల ప్రాజెక్టుకు 68,000 కూసెక్కుల వరద వచ్చి చేరుతుండగా ప్రాజెక్టు వద్ద 5గేట్లు ఎత్తి దిగువకు 75,200 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. పూర్తిస్థాయి నీటిమట్టం 318.516 మీటర్లు కాగా ప్రస్తుతం 318.430మీటర్లుగా ఉన్నది. పూర్తిస్థాయి నీటి నిల్వ 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుత 9.132 నీటి నిల్వగా ఉన్నది. జూరాల ఎడమ కాల్వకు 920, కుడి కాల్వకు 720, నెట్టెంపాడ్ లిఫ్టుకు 750, భీమా లిఫ్ట్–2కు 750 నీటిని విడుదల చేస్తున్నారు. ఐదు యూనిట్లలో విద్యుదుత్పత్తి కొనసాగుతుండగా 35,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. నారాయణపూర్ డ్యాం 7గేట్లు ఎత్తి 32,100 నీటిని దిగువకు వదులుతున్నారు. జూరాల ప్రాజెక్టుకు మొత్తం అవుట్‌ఫ్లో 75,200 క్యూసెక్కులు వరద దిగువకు విడుదల చేస్తున్నారు.

తుంగభద్ర డ్యాం, ఆర్డీఎస్‌కు..

అయిజ, సెప్టెంబర్ 30 : కర్ణాటకలోని ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు తుంగభద్ర డ్యాంకు వరద కొనసాగుతున్నది. ఇన్‌ఫ్లో 10,665 క్యూసెక్కులు ఉండగా, అవుట్‌ఫ్లో 10,153 క్యూసెక్కులు ఉన్నది. 105.788 టీఎంసీల గరిష్ఠ సామర్థ్యం కలిగిన టీబీ డ్యాంలో ప్రస్తుతం 101.773 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. 1633 అడుగుల నీటిమ ట్టానికి గానూ 1632 అడుగులు ఉన్నది. ఆర్డీఎస్ ఆనకట్టకు ఇన్‌ఫ్లో 9,310, అవుట్ ఫ్లో 8,673 క్యూసెక్కులు ఉన్నది. ఆర్డీఎస్ ఆయకట్టుకు 637క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ఆనకట్టలో 9 అడుగుల మేరకు నీటిమట్టం ఉన్నది.

ఆల్మట్టి, నారాయణపూర్‌కు..

ఎగువన కురుస్తున్న వర్షాలకు ఆల్మట్టి, నారాయణపుర ప్రాజెక్టులకు వరద కొనసాగుతున్నది. ఆల్మట్టి ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో 26,020 క్యూసెక్కులు ఉండగా, అవుట్ ఫ్లో 30 వేల క్యూసెక్కులు ఉన్నది. ప్రాజెక్టు గరిష్ఠ స్థాయి నీటిమట్టం 1705 అడుగులకు గానూ 1704.72 అడుగులు ఉన్నది. పూర్తిస్థాయి గరిష్ఠ నీటిమట్టం 129.72 టీఎంసీలకు గానూ ప్రస్తుతం 128.19 టీఎంసీల నిల్వ ఉన్నది. నారాయణపూర్ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 36 వేలు, అవుట్ ఫ్లో 32,100 క్యూసెక్కులు ఉన్నది. గరిష్ఠస్థాయి నీటిమట్టం 1615 అడుగులకుగానూ 1614.86 అడుగులు ఉన్నది. గరిష్ఠ స్థాయి నీటి నిల్వ 37.40 టీఎంసీలకు గానూ 37.54 టీఎంసీలు ఉన్నది.

జూరాల ప్రాజెక్టు గేట్ల నుంచి దిగువకు పరుగులు పెడుతున్న కృష్ణమ్మ

హెచ్‌సీఏ టోర్నీలో జిల్లా జట్టు విజయం

మహబూబ్‌నగర్ అర్బన్, సెప్టెంబర్ 30 : హెచ్‌సీఏ బాలుర అండర్–19 వన్డే రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీలో ఉమ్మడి పాలమూరు జట్టు ఘన విజయం సాధించింది. సోమవారం వరంగల్ మొగిలిచర్ల గ్రౌండ్‌లో మూడో మ్యాచ్‌లో జిల్లా జట్టు 90 పరుగుల తేడాతో మెదక్ జట్టుపై విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన జిల్లా జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 217 పరుగులుచేసింది. జట్టులో అభిలాశ్ 66 పరుగులు సాధించాడు.

అనంతరం బ్యాటింగ్‌కు దిగిన మెదక్ జట్టు 32.1 ఓవర్లలో 127 పరుగులు చేసి ఆలౌటైంది. జిల్లా బౌలర్ ఎండీ షేదాబ్ అహ్మద్ 27 పరుగులిచ్చి 4వికెట్లు తీశాడు. వరస విజయాలతో దూసుకుపోతున్న జిల్లా జట్టును ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, కోచ్ గోపాలకృష్ణ, అబ్బుల్లా అభినందించారు.

ఘన విజయం సాధించిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జట్టు